క్లుప్తంగా

దత్తాత్రేయుడికి పూజలు



శ్రీశైలంటెంపుల్: ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి శ్రీశైలదేవస్థానం అధికారులు, అర్చకులు గురువారం విశేషపూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ, అనంతరం అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

83 మందికి ఉద్యోగాలు



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత

నందికొట్కూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 83 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయని ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఆయా కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 194 మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరు కాగా 83 మంది ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



మట్టితో చదును చేస్తున్న దృశ్యం

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని భ్రమరాంబ టాకీస్ సమీపంలో అధ్వానంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. రోడ్డు దిగువన ఉండడం, డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో వర్షాకాలం వచ్చిందంటే మడుగును తలపిస్తుండేది. అక్కడి ప్రజల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్వంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టినట్లు స్థానికులు ఎన్.సురేష్, జి.మల్లేష్ గురువారం తెలిపారు.

మహానందిలో ట్రాన్స్‌పోర్ట్ ఆర్‌జేసీ పూజలు



దర్శనార్థం వచ్చిన ఆర్‌జేటీసీ బసిరెడ్డి, అధికారులు

మహానంది: ఏపీ రవాణా శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ బసిరెడ్డి గురువారం మహానందీశ్వర స్వామిని దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

మోడల్ స్కూల్ విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక



షేక్ సాదిక్, ఎం.సురేంద్ర, నసీహ ఖానం

వెలుగోడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. షేక్ సాదిక్, ఎం. సురేంద్ర ఇడుపులపాయ క్యాంపస్‌కు ఎంపిక కాగా, నసీహ ఖానం ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నళిని గురువారం అభినందించారు.

గుంతకందాలలో కార్డెన్ సెర్చ్



కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

వెలుగోడు: మండల పరిధిలోని గుంతకందాల గ్రామంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. స్థానిక ఎస్ఐ సురేష్, పాములపాడు ఎస్ఐ సురేష్, పోలీసు సిబ్బంది అనుమానిత ఇళ్లలో సోదాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మద్దిలేటి వద్ద నుంచి 19 బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. వాహనాలను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు.

ఏపీపీగా నాగరాజేశ్వర్ రెడ్డి

నంద్యాల (వ్యవసాయం): నంద్యాల మూడవ అదనపు జిల్లా జడ్జి కోర్టుకు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా సీనియర్ న్యాయవాది శీలం నాగరాజేశ్వర్ రెడ్డి పదవిని చేపట్టారు.ఆయన మాట్లాడుతూ ఏపీపీగా మూడు సంవత్సరాల పాటు ప్రభుత్వం తరఫున సేవలందిస్తానని చెప్పారు. తన వంతుగా పేదలకు ఉచిత న్యాయ సహాయం, సహాలను అందజేస్తానన్నారు. బార్ అసోసియేషన్ నాయకులు రాజేశ్వరరెడ్డిని అభినందించి సత్కరించారు.

నాడు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుల ఖాతాలకు సకాలంలో రైతుభరోసా జమ అయ్యేది. ఖరీఫ్ సీజన్ సాగుకు ముందే సబ్సిడీ విత్తనాలు, రసాయనిక ఎరువులు అందేవి. జూన్ మొదటి వారం నాటికే ఆర్బీకేలలో సిద్ధంగా ఉంచేవారు.

నేడు: ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని గాలికొదిలేసింది. ఖరీఫ్ ప్రారంభమైనా నేటికీ రైతుసేవా కేంద్రాల్లో ఎరువుల జాడ లేదు. సబ్సిడీ విత్తనాల ఊసేలేదు. పెట్టుబడి సాయం సంగతే మరిచారు. అప్పోసప్పో చేసి ప్రైవేట్ దుకాణాల వద్దకు వెళ్తే వారు ఒకటికి మరొకటి అంటగడుతున్నారు. అది కొంటేనే ఇది ఇస్తామంటూ ఖరాఖండిగా చెబుతున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎరువు..కరువు!

- ఖరీఫ్ సాగుకు అందని ఎరువులు
- సబ్సిడీ విత్తనాలు కూడా కరువాయె
- అడిగిన మందుతోపాటు మరో మందు అంటగడుతున్న ప్రైవేటు దుకాణాదారులు
- ఆందోళనలో రైతన్నలు



ఖరీఫ్ సీజన్ సాగుకోసం పంటపొలాలు సిద్ధంగా ఉంచిన రైతులు

కొత్తపల్లి: మండలంలో 12 గ్రామ పంచాయతీలో 12 వేల హెక్టార్ల భూమి ఉంది. ఇందులో 9 వేల హెక్టార్ల సాధారణ సాగుభూమి ఉంది. ఇందులోనూ మండలంలోని 10,486 మంది రైతులు సుమారు 8 వేల హెక్టార్లను ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసుకునేందుకు సిద్ధం చేసుకున్నారు. అయితే ప్రభుత్వంతో పాటు ప్రకృతి కూడా రైతన్నపై కన్నెర్ర చేసింది. జూన్ నెల ముగిసిపోతున్నా అరకొర వర్షాల వల్ల అక్కడక్కడా తప్ప.. పూర్తిస్థాయిలో విత్తనాలు వేసుకోలేని దుస్థితి నెలకొంది.

ఆర్‌ఎస్‌కేలకు చేరని ఎరువులు, సబ్సిడీ విత్తనాలు

మండలంలో ఖరీఫ్ సీజన్ మొదలై నెల పూర్తి కావస్తుంది. 8 వేల హెక్టార్ల సాగుకు గాను కేవలం మొక్కజొన్న 2,500 హెక్టార్లు, వరి 250 హెక్టార్లు, పత్తి 40 హెక్టార్లు మొత్తం 2,790 హెక్టార్లలో మాత్రమే రైతులు విత్తనాలు వేసుకున్నారు. విత్తనాలు వేసే సమయంలో రసాయన ఎరువులను విత్తనాలతో కలిపి వేసుకుంటారు. ఇంకా రైతుసేవా కేంద్రాలకు రసాయనికి ఎరువులు గాని, సబ్సిడీతో అందించే కంది, మినుము, శనగ విత్తనాలు రాలేదు. దీంతో రైతులు అప్పు చేసి ప్రైవేటు దుకాణాలలో కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ దుకాణాదారులు అసరం ఉన్నా లేకున్నా ఎక్కువ మందులను రైతులకు అంటగడుతున్నారు. అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

ప్రభుత్వమే ఎరువులను సరఫరా చేయాలి



పది ఎకరాల దాకా మినుము, మొక్కజొన్న, వరి సాగుచేస్తున్నాను. విత్తనాలు, రసాయనిక ఎరువులు చాలా అవసరం అవుతాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌కెలలో అందుబాటులో ఉంచేది. ఆటో చార్జీలు, ఎక్కువ వ్యయం అవసరం లేకుండా ఉండేది. ఇప్పుడు ఆర్‌ఎస్‌కేలలో ఇవి అందుబాటులో లేవు. కొనాలంటే ఆర్థిక భారం అవుతుంది. ప్రభుత్వమే ఎరువులను, విత్తనాలను సరఫరా చేయాలి.

– శీలం అచ్చన్న, రైతు, ముసలిమడుగు గ్రామం

చిరుత పట్ల అప్రమత్తంగా ఉండాలి

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామ శివారులో సంచరిస్తున్న చిరుత పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ రేంజ్ అధికారి సుభాష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సున్నిపెంట చేపల మార్కెట్ సమీపంలో ఒక ఇంట్లోకి చిరుత చొరబడిన ఘటనతో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. సెక్షన్ అధికారి మధన్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. కుక్కల కోసం చిరుతలు సంచరిస్తుంటాయని, రాత్రి వేళల్లో వెలుతురు లేకుండా శివారు ప్రాంతాల్లో ప్రజలు సంచరించరాదని హెచ్చరించారు. వర్షాకాలం కావడంతో గడ్డి, ఇతర మొక్కలు ఏపుగా పెరిగి ఉంటాయని, ఇళ్ల పరిసరాల్లో ఎత్తుగా ఏ వస్తువులను ఉంచుకోరాదని సూచించారు. వన్యమృగాల సంచారంపై అప్రమత్తంగా ఉండి అటవీ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు.

2న మండల సర్వసభ్య సమావేశం

మహానంది: వచ్చే నెల 2న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహబూబ్ దౌలా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులతోపాటు అధికారులు హాజరు కావాలని కోరారు.

చెక్కుల పంపిణీకి వారసత్వపు విచారణ



రైతుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి: శ్రీశైలం జలాశయం నిర్మాణ సమయంలో భూములు కోల్పోయి నష్టపరిహారం ఇప్పటి వరకు అందని వారికి మంజూరైన చెక్కుల పంపిణీ కోసం వారసత్వపు విచారణ నిర్వహించినట్లు హంద్రీనీవ సృజల స్రవంతి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని కొక్కెరంచ గ్రామంలో తహసీల్దార్ ఉమారాణితో కలిసి ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొక్కెరంచ, ఎదురుపాడు, గోకవరం గ్రామాల్లో శ్రీశైలం జలాశయం నిర్మాణంలో భూములు కోల్పోయి ఇప్పటికి నష్టపరిహారం పొందని 75 మంది రైతుల కుటుంబాలకు చెందిన వారసత్వపు విచారణ చేశామన్నారు. వీరికి వచ్చేనెల లోకదాలత్ జడ్జి సమక్షంలో చెక్కులు పంపిణీ చేయనున్నామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు వేణుగోపాల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాల జోలికెళ్లొద్దు



గాడ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

ఆత్మకూరు: విద్యార్థులు, యువత చెడు వ్యసనాల జోలికి వెళ్లరాదని తహసీల్దార్ రత్నరాధిక, సీఐలు రాము, సురేష్‌కుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, రెవెన్యూ, పోలీసు సిబ్బందితో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి కొత్త బస్టాండు, పాత బస్టాండు, గౌడ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవ హారంగా ఏర్పడి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు, డ్రగ్స్, మద్యానికి యువత అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి మార్గంలో నడిచి కుటుంబానికి రక్షణగా నిలవాలన్నారు. తల్లిదండ్రుల మాటలను లెక్కజేయకుండా తప్పుడు మార్గాల్లో నడిస్తే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు. అతివేగం ప్రమాదకరమన్నారు. బాగా చదువుకుని ఉన్నత స్థానాలు చేరుకుని తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని సూచించారు.

తలనీలాల వేలంలో రూ.1.85 కోట్ల ఆదాయం

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి తలనీలాల వేలం ద్వారా రూ.1.85 కోట్ల ఆదాయం లభించిందని ఆలయ ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు తెలిపారు. ఆలయంలో ఏడాది కాలానికి సంబంధించి స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించే తలనీలాల పోగు హక్కుల కోసం గురువారం వేలం పాట నిర్వహించారు. గుంటూరు జిల్లా దాచేపల్లికి చెందిన నాగరాజు రూ.1,85,40,000 హెచ్చుపాట పాడి దక్కించుకున్నారు.

రేపు సహాయ పరికరాల ఎంపిక శిబిరం

పాములపాడు: ఈ నెల 28న నందికొట్కూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో దివ్యాంగులు, వృద్ధులకు సహాయ పరికరాల ఎంపిక శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, వయో వృద్ధులకు మూడు చక్రాల సైకిల్, వీల్ చైర్, చంక కర్రలు, బ్యాటరీతో నడిచే మూడు చక్రాల సైకిల్, శ్రవణ యంత్రం, అంధుల చేతి కర్రలు ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇందుకు నియోజకవర్గం పరిధిలో ఎంపిక శిబిరం ఏర్పాటు చేయనున్నామని, అర్హులైన వారు సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్, బియ్యం కార్డులతోపాటు ఆధాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, వికలాంగత్వం కనపడేలా మూడు ఫొటోలు, స్వావలంబన కార్డు(యుడీ ఐడీ)లతో హాజరు కావాలని వివరించారు.

ఇంటింటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



కొణిదెలలో ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

పగిడ్యాల: వచ్చే నెల 1 నుంచి చేపట్టబోయే ఇంటింటి కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అధికారులకు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎంపీడీఓ సుమిత్రమ్మ, తహసీల్దార్ శివరాముడు తదితరులు పాల్గొన్నారు.

ఓహెచ్‌ఆర్ ట్యాంకు నిర్మాణం

నందికొట్కూరు: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దత్తత గ్రామం కొణిదెలలో ఆయన సొంత నిధులు రూ.50 లక్షలతో చేపట్టనున్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణానికి గురువారం ఎంపీ బైరెడ్డి శబరి, జిల్లా కలెక్టర్ రాజకుమారి, నందికొట్కూరు, రైల్వే కోడూరు ఎమ్మెల్యేలు జయసూర్య, శ్రీధర్, హ్యాండీక్రాఫ్ట్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ హరిప్రసాద్ శంకుస్థాపన చేశారు.

- జూపాడుబంగ్లా: మండల కేంద్రం సమీపంలోని కేసీ కాల్వలో పూడికతీత పనులను ఎమ్మెల్యే జయసూర్య గురువారం పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ ప్రసాద్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



రికార్డు రూమ్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

పగిడ్యాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ గురువారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేయరాదని, ప్రజలకు అందుబాటులో ఉండి సత్వర సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం రికార్డు రూమ్, డిప్యూటీ తహసీల్దార్, స్టాఫ్ రూమ్‌లను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థలో ఉందని ప్రతి గది కూడా పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయని తహసీల్దార్ శివరాముడు జేసీ దృష్టికి తెచ్చారు. కార్యాలయాన్ని ఆర్‌బీకే లేదా సచివాలయ భవనంలోకి మార్పు చేసేందుకు అనుమతించాలని కోరారు. జేసీ వెంట డిప్యూటీ తహసీల్దార్ మధు, డిప్యూటీ తహసీల్దార్(సర్వే) మురళీ, మండల సర్వేయర్ జ్ఞానప్రకాష్, ఏఎస్ఓ ఎల్లగౌడ్ తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



బైక్‌లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

నందికొట్కూరు: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. మండలంలోని వడ్డేమాన్ గ్రామంలో ఎస్ఐ తిరుపాలుతో కలిసి గురువారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానిత వ్యక్తులు, రౌడీ షీటర్ల ఇళ్లలో సోదాలు చేశారు. గడ్డివాములలో, పరిసర ప్రాంతాలను జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా సీఐ సుబ్రమ్మణ్యం మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదన్నారు. యువత మంచి మార్గంలో నడిచి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామానికి చెందిన మాధవనాయుడు వద్ద నుంచి 17 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వాహనాలు తనిఖీ చేసి రికార్డులు సరిగా లేని 18 బైకులు స్వాధీనం చేసుకున్నారు.

దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలి



బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: జూలై 9న చేపట్టే సమ్మెలో అంగన్‌వాడీ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు ఈ.హరిత విజ్ఞప్తి చేశారు. గురువారం నందికుంటలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ దుద్యాల సెక్టార్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమ్మె బుక్‌లెట్‌లను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, పని భారాన్ని తగ్గించాలని అంగన్‌వాడీ కార్మికులు పోరాటాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం తగదన్నారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ దుద్యాల సెక్టార్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా రాజమ్మ, శ్రీదేవి, ఉపాధ్యక్షులుగా నాగమణి, సహాయ కార్యదర్శిగా లైసెమ్మలను ఎన్నుకున్నారు.

క్యూలైన్ల విస్తరణ చేపట్టాలి

- ఎస్ఎస్ చంద్రశేఖర ఆజాద్



క్యూలైన్లను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి ఆజాద్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఆలయం, ఇతర చోట్ల అవకాశం మేరకు క్యూలైన్ల విస్తరణను చేపట్టే అంశాన్ని పరిశీలించాలని తిరుపతి ప్రాంతీయ సంయుక్త కమిషనర్, మల్టీజోన్-2 ఎస్ఎస్ చంద్రశేఖర ఆజాద్ అధికారులకు సూచించారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం దేవస్థానాల్లో ఏర్పాట్ల పరిశీలకుడిగా దేవదాయశాఖ ఎస్ఎస్ చంద్రశేఖర ఆజాద్‌ను నియమించింది. ఈ మేరకు గురువారం శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావుతో కలిసి, ఆజాద్ ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు, ప్రసాదాల విక్రయకేంద్రాలు, అన్నప్రసాదవితరణ, కల్యాణకట్ట, క్షేత్ర పరిధిలోని పారిశుద్య నిర్వహణను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

క్షయవ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దు



మాట్లాడుతున్న టీబీ సూపర్‌వైజర్ మస్తానయ్య

ఆత్మకూరు: క్షయవ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దని టీబీ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ మస్తానయ్య చెంచు, గిరిజనులకు సూచించారు. మండలంలోని ఇందిరేశ్వరం చెంచుగూడెంలో క్షయవ్యాధిపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దగ్గు, జలుబు, జ్వరం తగ్గకపోతే ఆస్పత్రికి వెళ్లి గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధిగా నిర్ధారణ అయితే ఆందోళన చెందకుండా క్రమం తప్పకుండా మందులు వాడి నయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ ధనలక్ష్మి, మల్టీ పర్పస్ హెల్త్ సూపర్‌వైజర్ సరోజమ్మ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామతులసి, రఫిక్ పాల్గొన్నారు.

కనికలమ్మ చెరువు కట్ట పరిశీలన

కొత్తపల్లి: మండల కేంద్రం పరిధిలోని కనికలమ్మ చెరువు కట్టను గురువారం తహసీల్దార్ ఉమారాణి వీఆర్వోలు అశోక్, రామసుబ్బయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామానికి చెందిన కనికలమ్మ చెరువు రస్తా పునరుద్ధరించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గ్రామస్తులు అర్జీ ఇచ్చారన్నారు. చెరువు కట్ట రస్తాను పరిశీలించామని త్వరలో రస్తా సమస్యను పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

దాడులను ఖండించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను కేంద్ర ప్రభుత్వం ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్ కోరారు. పట్టణంలోని కొత్త బస్టాండు ఎదుట గురువారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం అమెరికా, ఇజ్రాయెల్‌కు కొమ్ము కాస్తోందని ఆరోపించారు. ప్రపంచశాంతి కోసం దేశ పరిరక్షణ కోసం తాము కట్టుబడి ఉన్నామని, యుద్ధాలను వామపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ఇరాన్‌పై దాడిని ఖండించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, ఈరన్న, నాగేశ్వరరావు, గణపతి, చాంద్, వెంకటేశ్వర్లు, రఫి, రాము తదితరులు పాల్గొన్నారు.

అలరించిన తోలుబొమ్మలాట

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళావేదికపై కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన వైవీ నరసింహారావు రామాయణం–సుందరకాండపై ప్రదర్శించిన తొలుబొమ్మలాట ఆకట్టుకుంది. కళాకులుగా వి.నరసింహారావు వ్యవహరించగా, గాత్ర సహకారాన్ని రమణరావు, కొండమ్మ, రమణమ్మ, నాగేశ్వరరావు అందించారు.



రైతుల సమస్యలు పట్టని ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి



రైతులతో శిల్పా చక్రపాణిరెడ్డి



పిట్టం రామసుబ్బారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శిల్పా

బండి ఆత్మకూరు: రైతుల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆరోపించారు. గురువారం మండలంలోని ఈర్నపాడు గ్రామంలో పర్యటించి రైతులు సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల కోసం రైతులు గంటల తరబడి క్యూలైన్‌లలో నిలబడాల్సి రావడం బాధాకరమన్నారు. తమ వైఎస్సార్‌సీపీ హయాంలో రైతు భరోసా కేంద్రాలకు ఎరువులు అందించడం ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతులకు సరిపడా ఎరువులను సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవసరమైన ప్రతిరైతుకు ఎరువులు అందజేయాలని, లేనియెడలా రైతులతో కలిసి ధర్నాకు దిగుతామని హెచ్చరించారు.

నివాళి..

ఇటీవల మృతిచెందిన ఈర్నపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ వీఆర్‌ఓ పిట్టం రామ సుబ్బారెడ్డి చిత్ర పటానికి మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండలంలో పార్టీకి పెద్ద దిక్కును కోల్పోయామని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు బారెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకట రామిరెడ్డి, వైస్ ఎంపీపీ రాగాల రమణ తదితరులు పాల్గొన్నారు.

విలేకరి కుటుంబానికి ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు: అనారోగ్యంతో మృతిచెందిన మిడుతూరు మండలం వార్తా విలేకరి మధు కుటుంబానికి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. గురువారం మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శివరామకృష్ణారెడ్డి, పార్టీ మిడుతూరు మండల కన్వీనర్ లోకేష్‌రెడ్డి, నాయకులు బన్నూర్ నాగిరెడ్డి నగదును విలేకరి కుటుంబ సభ్యులకు అందించారు.